# అటూ: ఇటూ

శ్రీ అనిశెట్టి సుబ్బారావు.

మేము ప్రైవేటు చదువుకోటానికి వెళ్ళే తోవలో రెండు వేప చెట్లున్నాయి. అవి ఎంత ఎత్తనీ! మబ్బంత!

ఒకరోజు మేము వెడుతోంటే కాకిగుడ్డు కిందపడి పక్కుమని పగిలిపోయింది. మా జవాను నరసాయ్ 'వొద్దు, వొద్దు' అని లాక్కెళ్లాడు గాని లేకుంటే సిరాబుడ్డిలోవేసి ఏమౌతుందో చూసేవాణ్ణి!

చెట్ల నీడల్లో చల్లగావుంటుంది. బడికిపోకుండా అక్కడే కూచోవాలనిపించేది. మా నరసాయ్ ఊరుకుంటేగా!

దానికింద చెప్పులు కుట్టకుంటూండేవాడు. కత్తి బాదుతూనో, తోళ్లు లాగుతూనో వుంటాడు ఎప్పుడు, మానాన్నలాగుంటాడు పొట్టిగా, నల్లగా. ఆయనలాగు విసుగుపడడెందుకో! పాపం దుమ్ములోనే కూచుంటాడు, నాలాగు ఇస్త్రీచొక్కాలు వేసుకోవటం వాడికిష్టం లేదేమో!

శెలవలై, వచ్చిచూస్తే చెట్టులేదు ఒకటి, గాలివానకు పడిపోయిందట. కొమ్మలన్నీ ఉయ్యాలల్లాగు ఊగుతూండేవి. జవానును అడగ్గా అడగ్గా ఒప్పుకునేవాడు. ఆ కొమ్మలమీద వుయ్యాలవూగుతూ ఎంతమంది పిల్లలని! పుస్తకాలు, సిరాబుడ్డి, నరసాయ్ చేతికిచ్చి ఒక్క ఉరుకు ఉరికేవాణ్ణి! చిటారుకొమ్మకు ఎక్కాలని చూసేవాణ్ణి; పాపం! మా జవాను చూస్తూ కూచునేవాడు. ఏమీ అనడుగా! బీడీలకు కానీ అడిగేవాడు. చిటారుకొమ్మను ఎక్కే మాలవాణ్ణిమాత్రం తాకొద్దన్నాడు.

నాతో లక్ష్మయ్ వచ్చేవాడు. మాలవాడితోచేరి చెట్టంతా వూపేసేవాడు. పిల్లలంతా కలిసి చెట్టంతా దులిపివేసేవాళ్లు.

మా నరసాయ్ లక్ష్మయ్‌తో, బోడితో, చిట్టితో చెప్పాడు. మేమెవ్వరమూ అప్పట్నుంచి మాలోణ్ణి తాక ఏం లేదుగా! వాడు మసిమసిగావుంటాడనీ, చెప్పులుకుట్టేవాడి కొడుకనీ, జవాన్లుచూస్తే అమ్మతో చెపుతారనీ అన్నాడు. మాకేం! మేమే ఆడుకుంటున్నాము.

మేము బడినుంచి వస్తూ పోతూ చూస్తే మాలవాళ్ళబ్బాయి అక్కడే వుండేవాడు. వాడు తలకూడా దువ్వుకోడు. వాడు ఇంటికి వెళ్ళడేం? వాళ్ళ నాయనపక్కనే కూచునో, దుమ్ములో నిద్రపోతూనే వుండేవాడు.

మేము ఎత్తైనకొమ్మలమీద ఉయ్యాలూగుతుంటే వాడొక్కడే ఎక్కి చిటారుకొమ్మమీద కూచున్నాడు. ఎంతదుడుగ్గా ఎక్కుతాడు. నేనెక్కలేనబ్బా! అమ్మో! భయంపుట్టదూ!

మా లక్ష్మయ్ ఊరుకున్నాడూ! ఎగిరెక్కి వాణ్ణి దిగిపొమ్మన్నాడు. దిగనన్నాడు. కొమ్మపట్టుకుని గట్టిగా ఊపి విసిరివదిలాడు లక్ష్మయ్. ఒక్కదెబ్బతో క్రింద బోర్లా పడ్డాడహ్హాహ్హా! అందరమూ నవ్వాం. ఒళ్ళుదులుపుకోని తిరిగి తిరిగి చూస్తూవెళ్ళి వాళ్ళనాయన దగ్గర కూచున్నాడు.

నాలుగురోజులు వాడట్లాగే మమ్మల్నిచూస్తూ దుమ్ములో పొర్లాడుతూండేవాడు. ఒకరోజు మా జవాను రాలేదు. నేనూ, బోడీ, సీతిగాడూ, లక్ష్మయ్ పరుగెత్తి చెట్టెక్కేశాం. నాపలకలూ, పుస్తకాలూ, సిరాబుడ్డీ చెప్పులు కుట్టేవాడివద్ద పెట్టాను. చూస్తానన్నాడు. కానీ అడగలేదు. వాడికొడుకు చేతుల్లోగడ్డం పెట్టుకోని చెట్టుమొదట కూచున్నాడు. మేం సర్రన పైకెక్కి ఒక్కవూపు వూపేశాం. వాడు పైకెక్కుతాడనుకున్నాం. ఎక్కడే! మావేపైనా చూడ్డే! పోలీసు అటునుంచి రానూ, వచ్చి కేకవేశాడు. మా ఇంటికి వాళ్ళు నాన్నదగ్గరికి వస్తూవుంటారు. నన్నెరుగు. ఐనా నాకు భయమేసింది. అమ్మో! దగ్గరగావచ్చి పెద్దగా అరిచాడు. మాలవాడు పోలీసువైపైనా చూడ్డే! దిగులుగా మావంకచూశాడు. వాడెందుకూ ఏడుస్తాడు!

పోలీసు మమ్మల్నేమీ అనలేదు. వాణ్ణే! వాణ్ణే రెక్కపట్టుకు లాగి ఫెడీఫెడీమని నాలుగు కుమ్మాడు. వీపంతా పగలగొట్టాడు. ఎంతసేపు! కేకవేసి వెళ్ళిపొయ్యాడు. నాతో అన్నాడు 'ఇంటికెళ్లు నాయనా, మీనాన్న వెతికిస్తాడు.' మాలవాడు వాళ్ళనాయన దగ్గరికి వెళ్ళి ఏడుస్తో దెబ్బలు చూపుకుంటూనే మావంక వేలుచూపుతున్నాడు. మాకు భలేనవ్వు! ఎంత నవ్వామని! అబ్బ! అంతలో మా నరసాయ్‌వచ్చి 'గంటకొట్టారని' వేధించబట్టిగాని లేకుంటే ఇంకా ఏడిపించేవాళ్ళం!

వాడిప్పుడు మాదగ్గరికి వస్తాడనా! దూరంగా తిరుగుతూ దిగులుగా చూస్తూంటాడు. ఇప్పుడు చిటారుకొమ్మనెక్కేది నేనేగా!